సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం


శుక్రవారం ꞉ 7 ꞉ మార్చి ꞉ 2025



.. శాశ్వత పరిష్కారం దిశగా

దివ్యాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్ల స్థానంలో యూడీఐడీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

8లో



గరిష్ఠం / కనిష్ఠం
36° / 17°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యే ఎండ మధ్యాహ్నానికి పెరుగుతుంది. తెల్లవారు జామున, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు జరిపారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కానుకలకు క్యూఆర్ కోడ్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ, బ్యాంక్ అధికారులు

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లికి కానుకలు సమర్పించే భక్తులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు ఎస్‌బీఐ అధికారులు ఆలయంలో గురువారం క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. భక్తులు సెల్‌ఫోన్లతో స్కాన్ చేసి కానుకలు చెల్లించేలా వెసులుబాటు కల్పించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ వరంగల్ డీజీఎం ఘనశ్యామ్ సోలంకీ, రీజినల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, పాల్వంచ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎ.బంగారయ్య పాల్గొన్నారు. కాగా, ఈనెల 10వ తేదీన హుండీల్లోని కానుకలు లెక్కించనున్నట్లు ఈఓ మరో ప్రకటనలో తెలిపారు.

మణుగూరు కోర్టుకు జిల్లా జడ్జి

సదుపాయాలు, వసతులపై ఆరా..



జిల్లా జడ్జికి మొక్క అందజేస్తున్న భవాని

మణుగూరు టౌన్: మణుగూరు జ్యుడీషియల్ ప్రథమశ్రేణి కోర్టును జిల్లా జడ్జి పాటిల్ వసంత్ గురువారం సందర్శించారు. కోర్టులో అవసరమైన గదులు, తాగునీటి వసతి తదితర సదుపాయాలపై చర్చించారు. కోర్టుకు గేట్ ఏర్పాటుచేయాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక న్యాయవాదులు జడ్జిని కోరగా నిధుల మంజూరుకు హైకోర్టుకు నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు మేదరమెట్ల శ్రీనివాస్, కిషన్‌రావు, కందిమళ్ల నర్సింహారావు, కవిత, వాసవి, సర్వేశ్వరరావు, నగేశ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట మెజిస్ట్రేట్‌గా భవాని

దమ్మపేట/ కొత్తగూడెంటౌన్: దమ్మపేట కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా బి.భవాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆమె కొత్తగూడెం కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సిగరేణి భవన్‌లో నేడు స్ట్రక్చర్ సమావేశం

హాజరుకానున్న సీఎండీ, డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం) : హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆరేళ్ల తర్వాత శుక్రవారం స్ట్రక్చర్ సమావేశం నిర్వహిస్తున్నారు. సీఎండీ బలరామ్, ఇద్దరు డైరెక్టర్లు, 11 మంది గుర్తింపు సంఘం ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. వాస్తవానికి ముగ్గురు డైరెక్టర్లు రావాల్సి ఉన్నా.. ప్రస్తుతం డైరెక్టర్(పా) పోస్ట ఖాళీగా ఉండడంతో ఇద్దరే హాజరవుతున్నారు. కార్మికుల సొంతింటి కల నిజం చేయాలని, ప్రతీ కార్మికుడికి 250 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి వడ్డీ లేకుండా రూ.30 లక్షల రుణం ఇవ్వాలని, కార్మికులు అనారోగ్యానికి గురైతే ఆస్పత్రి ఖర్చంతా యాజమాన్యమే భరించాలని, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సైతం ఉచితంగా వైద్య సేవలందించాలని, సింగరేణి వ్యాప్తంగా పనిచేసే కార్మికులకు విశ్రాంతి షెల్టర్లు ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు కోరనున్నారు.

మిథిలా.. వ్యథ



రామయ్య కల్యాణం జరిగే మిథిలా స్టేడియం

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు సిద్ధమవుతోంది. శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలకు సరిగ్గా నెల రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భారీ సంఖ్యలో భక్తులు వస్తారు. ఇంతటి ఘనమైన వేడుకలకు వేదికైన మిథిలా స్టేడియం మాత్రం అనేక సమస్యల నడుమ కొడగట్టిపోయినట్టుగా మిగిలిపోతోంది. ఎందరు మంత్రులు వచ్చినా, కలెక్టర్లు మారినా ఈ స్టేడియం తలరాత మాత్రం మారడం లేదు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సమస్యల వలయంలో స్టేడియం

- నిరుపయోగంగా మారిన హాళ్లు
- గ్యాలరీ నుంచి చూస్తే దైవ దర్శనం దుర్లభమే
- కన్నెత్తి చూసేందుకు ఇష్టపడని సర్కారు పెద్దలు

నాడు పొగడ చెట్టు నీడన..

భక్త రామదాసు కాలంలో శ్రీరామనవమి వేడుకలు ఆలయ ప్రాంగణంలో ఉన్న పొగడ చెట్టు నీడన జరిగేవి. ఆ తర్వాత కాలంలో ఆలయం పడమర మెట్ల పక్కన ఉన్న చిత్రకూట మండపంలో ఈ వేడుక నిర్వహించారు. అయితే రానురాను భక్తుల రద్దీ పెరగడంతో ఆలయం వెలుపల చలువ పందిళ్లు వేసి కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 1960లో కల్యాణమండప నిర్మాణ పనులు చేపట్టగా 1964లో ప్రారంభించారు. అనంతరం 1986లో జరిగిన నవమి, మహాసామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం సందర్భంగా కల్యాణ మండపం చుట్టూ గ్యాలరీ నిర్మించి మిథిలా స్టేడియంగా నామకరణం చేశారు. భద్రాచలంలో జరిగే ముక్కోటి వేడుకల సమయంలోనూ ఉత్తర ద్వారంలో శ్రీరాముడిని దర్శించుకునే భక్తులు మిథిలా స్టేడియం వైపునే ఉంటారు.

పొందిక లేదు.. దర్శనం కరువు

మిథిలా స్టేడియాన్ని ఒకేసారి నిర్మించలేదు. 1960లో పనులు ప్రారంభిస్తే ప్రస్తుతం ప్రసాద్ పథకంలో షెడ్ల నిర్మాణం వరకు వేర్వేరు కాలాల్లో పనులు చేపట్టారు. దీంతో కల్యాణ మండపం, ప్రేక్షకుల గ్యాలరీ, ఉత్తర ద్వారం, గ్యాలరీల మధ్య పొందిక కుదరలేదు. ఈ స్టేడియం గ్యాలరీలో కూర్చునే సామాన్య భక్తులకు ఇటు కల్యాణం, అటు ఉత్తర ద్వార దర్శనం రెండూ సరిగా కనిపించవు. దీనికి తోడు పర్వదినాల్లో ఇక్కడ ఏర్పాటు చేసే పందిళ్ల కారణంగా దైవ దర్శనం మరింత దుర్లభంగా మారుతోంది. ఉచిత దర్శనానికి గ్యాలరీలకు వచ్చే భక్తులతో పాటు రూ.250, రూ.500 తదితర సెక్టార్ల టికెట్లు తీసుకునే భక్తులకు సీతారాముల దర్శనం కనిపించీ కనిపించనట్టుగా జరుగుతోంది. ప్రతీ ఏడాది ఇదే తంతు సాగుతున్నా సామాన్య భక్తుల కష్టాలను పట్టించుకునే వారు కరువయ్యారు.

'మిథిల'పై దృష్టి సారిస్తే..

శ్రీరామనవమి, ముక్కోటి పర్వదినాలకు వచ్చే ముఖ్యమంత్రులు, మంత్రులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, జిల్లా కలెక్టర్, ఎస్పీ మొదలు ఆయలం ఈఓ వరకు అందరూ వీఐపీ గ్యాలరీల్లో ఉంటారు. దీంతో సామాన్య భక్తులు, ఆ తర్వాత రూ.250 టికెట్ కొనుగోలు చేసే భక్తుల కష్టాలు వారి దృష్టికి రావడం లేదు. కల్యాణం, ముక్కోటి, దర్శనం ఇలా ఇక్కడికి వచ్చే మంత్రులు, సీనియర్ అధికారులు ఒక్కసారి మిథిలా స్టేడియాన్ని నిశితంగా పరిశీలిస్తే వెంటనే పునరుద్ధరణ చర్యలకు ఉపక్రమిస్తారు. కానీ వచ్చిన చిక్కంతా ఏ ఒక్కరూ ఈ స్టేడియాన్ని పట్టించుకోవడం లేదు. ఆఖరికి నవమి, ముక్కోటి సందర్భంగా నిర్వహించే సమీక్ష సమావేశాల్లోనూ మిథిలా స్టేడియంలో నెలకొన్న సమస్యలు అసలు ప్రస్తావనకే రావడం లేదు. దీంతో మిథిలా స్టేడియం కష్టాల సుడిగుండంలోనే ఉండిపోతోంది.

దాతలు ముందుకొచ్చినా..

ఇప్పటికే భద్రాచంలో స్థల సమస్య తీవ్రంగా ఉంది. ఇలాంటి సందర్భంలో ఆలయం సమీపంలో రెండున్నర ఎకరాల్లో సగానికి పైగా నిరుపయోగంగా ఉన్న మిథిలా స్టేడియం పునరుద్ధరణ, పునర్ నిర్మాణంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భద్రాచలం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వివిధ కార్పొరేట్ కంపెనీల వారు, దాతలు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఆ దిశలో అయినా మిథిలా స్టేడియంలో నెలకొన్న సమస్యలకు మంగళం పాడాల్సిన అవసరముంది.

భూత్ బంగ్లాలను తలపిస్తున్న హాళ్లు..



చెత్త, పనికిరాని వస్తువులతో నిండిన ఓ హాల్

నిర్వహణపరమైన లోపాల కారణంగా మిథిలా స్టేడియం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. ఈ స్టేడియం మధ్యలో కల్యాణ మండపం ఉండగా గ్యాలరీకి దిగువన గోదావరి ఉప నదులైన కిన్నెరసాని, శబరి, ప్రాణహిత, మానేరు, వార్ధా, పెన్‌గంగా తదితర పేర్లతో ఎనిమిది పెద్ద హాళ్లు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. చెత్తా చెదారంతో బూజుపట్టి భూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. కొబ్బరి ముక్కలు ఆరబెట్టడానికి, పనికిరాని సామాన్లు నిల్వ చేయడానికి ఉపయోగించే గోదాముగా ఉపయోగపడుతున్నాయి. కేవలం పోకల దమ్మక్క నిత్యాన్నదానసత్రం ఒక్కటే శుభ్రమైన వాతావారణంలో నడుస్తోంది. ఆ పక్కనున్న టాయిలెట్ల నుంచి మొదలుపెడితే మిగిలిన గ్యాలరీలన్నీ కనీసం అడుగు పెట్టడానికి వీలు లేనంత అపరిశుభ్రంగా ఉన్నాయి. వీటి మధ్యనే ఉన్న ఒక హాలులో అఖండజ్యోతి రామ నామ సంకీర్తనలు నిర్వహిస్తున్నారు.

వేడుకల విజయవంతానికి సమష్టిగా పనిచేద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అధికారులు

- పర్ణశాలలోనూ తగిన వసతులు కల్పించాలి
- నవమి, పట్టాభిషేక మహోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు రావొద్దు
- కుటుంబసభ్యులతో హడావిడి చేస్తే చర్య తప్పదు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ పాటిల్ స్పష్టీకరణ

భద్రాచలం : వచ్చే నెల 6, 7 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వేడుకల నిర్వహణపై గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీఐపీలే కాకుండా సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతేడాది ఐక్యంగా పనిచేసి వేడుకలను విజయవంతం చేశామని సిబ్బందిని అభినందించిన కలెక్టర్.. ఈ సంవత్సరం కూడా అలాగే పని చేయాలని పిలుపునిచ్చారు. ఐటీసీ సహకారంతో శాశ్వత పద్ధతిలో మరుగుదొడ్లు నిర్మించాలని, మొబైల్ వాహనాలకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సెల్లార్లలో నిరంతరం తాగునీరు సరఫరా చేసేలా ట్యాప్‌ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. స్టేడియం సమీపంలో అగ్నిమాపక పరికరాలు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న జనరేటర్‌కు అదనంగా మరో 250 కేవీ జనరేటర్‌ను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆయా అధికారులకు సూచించారు. ఆ రెండు రోజులు భద్రాచలంలో మద్యం దుకాణాలను మూసివేయించాలన్నారు. భక్తుల నుంచి ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు అధిక ధరలు వసూలు చేయకుండా చూడాలని చెప్పారు. భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని, వంతెనపై వాహనాలు నిలిచిపోతే తరలించేందుకు క్రేన్లు సిద్ధంగా ఉంచాలని పోలీస్ అధికారులకు సూచించారు.

పర్ణశాలనూ పట్టించుకోండి..

రామాలయానికి అనుబంధంగా ఉన్న పర్ణశాలలోనూ భక్తులకు సరైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పర్ణశాల వెళ్లే దారిలో సైడ్ రోడ్డు బీటీకి ప్రణాళికలు, అంచనాలు అందించాలని, అక్కడ కూడా శాశ్వత మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని సూచించారు. షాపింగ్ కాంప్లెక్స్ షెడ్ నిర్మాణ ప్రతిపాదనలు అందించలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం ఈ నెలాఖరు వరకైనా పూర్తి చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేలా దాతలను ఆహ్వానించాలని, వేడుకల అనంతరం వారిని సత్కరించాలని సూచించారు. కల్యాణ మండపంలో కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు.

కుటుంబసభ్యులకు ఆ తర్వాత అవకాశం..

నవమి, పట్టాభిషేకం రోజుల్లో బంధువుల, కుటుంబసభ్యుల దర్శనాలకు అధికారులు, సిబ్బంది ప్రాధాన్యత ఇవ్వొద్దని, అలాంటి నాటకాలు చేయొద్దని ఘాటుగా హెచ్చరించారు. ఆ రెండు రోజుల పాటు వారిని రావొద్దని చెప్పాలని, తాను కూడా ఇప్పటికే ఇంట్లో చెప్పానని అన్నారు. సామాన్య భక్తులు సంతృప్తిగా దర్శించుకునేలా సహకరించాలని కోరారు. వేడుకల హడావిడి ముగిశాక కుటుంబసభ్యులతో వచ్చి ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకోవాలని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ఈఓకు సూచించారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వచ్చే సమావేశం నాటికి పూర్తయిన పనులు, ఏర్పాట్ల వివరాలతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ.. నవమి సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు అదనంగా కొందరిని నియమించి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ 2వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఆర్డీఓలు దామోదర్ రావు, మధుసూదన్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలి

కొత్తగూడెంఅర్బన్: ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. దరఖాస్తులను ఎల్ –1 ఎల్ –2, ఎల్ –3గా విభజించాలని, అత్యంత పేదలు, దివ్యాంగులు, ఏ ఆధారం లేనివారికి ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అన్ని గ్రామాల్లో దరఖాస్తుల పరిశీలన వివరాలను ప్రతీ రోజు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఈనెల 31లోగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకున్న వారికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ధరణి మాడ్యూల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, హౌసింగ్ పీడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుమనోహరం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామయ్య సన్నిధిలో ఖమ్మం జిల్లా జడ్జి..

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేశాక పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలను అందజేశారు. భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఐఏఎస్ వివాహం



నూతన వధూవరులతో జిల్లా జడ్జి, కలెక్టర్

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఓ ఐఏఎస్ అధికారి వివాహం చేసుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన స్నేహ ప్రస్తుతం ఒడిశా కేడర్‌లో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి అఖిల్‌రెడ్డితో వివాహం నిశ్చయం కాగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన మారుతీ సదనంలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గురువారం వీరి వివాహం వైభవంగా సాగగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ బి.రాహూల్, భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ప్రశాంతంగా ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు

9,030 మందికి
8,759 విద్యార్థుల హాజరు



కొత్తగూడెంలోని ఓ కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని 36 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 9,030 మంది విద్యార్థులకు గాను 8,759 మంది పరీక్ష రాయగా, 271 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టిస్ ఘటనలు చోటుచేసుకోకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఎదురైతే తక్షణ చికిత్స కోసం వైద్యారోగ్య సిబ్బందితో పాటు మందులు అందుబాటులో ఉంచారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రుణాల మంజూరు పూర్తి చేయాలి

భద్రాచలం: ట్రైకార్, ఎంఎస్‌ఎంఈ యూనిట్ల లబ్ధిదారుల రుణాల మంజూరును వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ బ్యాంకర్లకు సూచించారు. తన చాంబర్‌లో గురువారం ఆయన బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రౌండ్ చేసిన 70 ట్రైకార్ యూనిట్లు ఈనెల 31 నాటికి లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లలో కొన్ని పలు కారణాలతో నిలిచిపోయాయని, అర్హులైన వారికి మంజూరు చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఏడీ భాస్కరన్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌రెడ్డి, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజ్



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

బూర్గంపాడు: సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నందున ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తీసుకురావాలని, నేరాల తీరును వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు. అప్పనంగా డబ్బు వస్తుందనే ఆశతో సెల్‌ఫోన్‌లోని యాప్‌లు, లింక్‌లను క్లిక్ చేయవద్దని ప్రజలకు సూచించారు. ఆయన వెంట సీఐ నాగరాజు(స్పెషల్ బ్రాంచ్), ఎస్‌ఐలు రాజేష్, నాగభిక్షం తదితరులు ఉన్నారు.

సీతారామ కాల్వ కళకళ..



వినోభానగర్ వద్ద కాల్వలో ప్రవహిస్తున్న గోదావరి జలాలు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ వద్ద గల సీతారామ ప్రాజెక్ట్ కాల్వ గోదావరి జలాలతో కళకళలాడుతోంది. సీతారామ కెనాల్ ద్వారా ఏన్కూర్ వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌లోకి నీటిని మళ్లించిన విషయం తెలిసిందే. సీతారామ ప్రాజెక్ట్ పనులు చేపట్టిన తొమ్మిదేళ్లకు గోదావరి జలాలు కెనాల్‌లో ప్రవహించడంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏన్కూర్ రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం రూ.96 కోట్లు మంజూరు చేయగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎట్టకేలకు పనులు పూర్తి కావడంతో అశ్వాపురం మండలం బీజీకొత్తూరు, ములకలపల్లి మండలం కమలాపురం పంప్‌హౌస్‌ల ద్వారా జూలూరుపాడు మండలం వినోభానగర్‌కు నీరు చేరుకుంది. అక్కడి నుంచి ఏన్కూరులోని ఎన్నెస్పీ కెనాల్ వద్ద గోదావరి, కృష్ణా జలాలు అనుసంధానం అయ్యాయి.

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద తగ్గుతున్న గోదావరి

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుతోంది. గత మూడు రోజులుగా సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 పంప్‌హౌస్ ద్వారా నీరు ఎత్తిపోసి దిగువకు వదలగా, ఎన్నెస్పీ కెనాల్‌కు చేరింది. దీంతో పాటు జిల్లా మొత్తానికి మిషన్ భగీరథ నీరు, భారజల కర్మాగారం, బీటీపీఎస్, సింగరేణి, దుమ్ముగూడెం హైడల్ ప్రాజెక్ట్, ఐటీసీ పీఎస్‌పీడీకి సైతం ఇక్కడి నీటినే వినియోగిస్తారు. మూడు రోజుల క్రితం 49.6 మీటర్ల నీటి మట్టంతో ఆనకట్టపై నీరు పొంగి ప్రవహించగా గురువారం 49.2 మీటర్లకు తగ్గింది. వచ్చేది వేసవి కాలం కావడంతో నీరు భారీగా తగ్గితే తాగునీరు, పరిశ్రమలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఎన్నెస్పీ కెనాల్‌కు మరో రెండు రోజుల పాటు నీరు ఎత్తిపోస్తే ఇక్కడ మరింతగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.



దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇలా..

క్లుప్తంగా

19న ఏఐకేఎస్ జిల్లాస్థాయి సమావేశం



మాట్లాడుతున్న విశ్వనాథం

చర్ల: పాల్వంచ మండలం జగన్నాథపురంలో ఈ నెల 19న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం కోరారు. చర్లలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు వామనరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రైతులు పండించిన గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ఈ మేరకు రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, సంగ్రా నరేంద్రకుమార్, అడ్డగర్ల తాతాజీ, నర్సింహారావు, రమణయ్య, మహేశ్, తేజ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు సింగరేణి విద్యార్థుల ఎంపిక



మణుగూరురూరల్: విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం)/మణుగూరురూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి అందించనున్న సైన్స్ (ఇన్‌స్పైర్) అవార్డులకు సింగరేణి పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న 9 సింగరేణి ఉన్నత పాఠశాలల్లో జయశంకర్ భూపాలపల్లి, మణుగూరు, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, సెక్టార్-2 పాఠశాలల్లోని ఒక్కో విద్యార్థి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థికి రూ.10 వేలు (పలు రకాల సైన్స్ ప్రాజెక్టుల తయారీకి) ఇవ్వనున్నారు. కాగా, మణుగూరులోని సింగరేణి హైస్కూల్ నుంచి ఎంపికైన విద్యార్థి ఎస్‌డీ ఇంతియాజ్‌పాషాను కరస్పాండెంట్, డీజీఎం(పి) రమేశ్, హెచ్‌ఎం స్వరూపారాణి, గైడ్ టీచర్ మమత అభినందించారు.

అంబేడ్కర్ సన్నిధిలో అన్నప్రాసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద అన్నప్రాసన చేస్తున్న కుటుంబీకులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లికి చెందిన నీలం సురేశ్, సంధ్య దంపతులు తమ ఆరు నెలల కుమారుడు మోక్షకు ప్రధాన సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట అన్నప్రాసన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పెన్ను, పుస్తకం, నగదు, బంగారం, పొంగలితోపాటు రాజ్యాంగం పుస్తకాన్ని ఉంచి బంధువుల సమక్షంలో వేడుక జరిపించారు. బాలుడిని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కుల నిర్మూలన కోసం అంబేడ్కర్ చేసిన కృషి, దేశానికి చేసిన సేవలపై గౌరవంతో తన బిడ్డకు ఆయన సన్నిధిలో అన్నప్రాసన నిర్వహించామని సురేశ్ తెలిపారు. ములకలపల్లి మండలం పూసుగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో పీడీగా సురేశ్.. దమ్మపేట మండలం అంకంపాలెం గిరిజన సంక్షేమ గురుకులంలో లైబ్రేరియన్‌గా సంధ్య పనిచేస్తున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ బురాన్, చల్లా రమేశ్, నీలం వెంకటేశ్వర్లు, పుల్లయ్య, వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీఈ ప్రభాకర్‌రావుకు మొక్క అందిస్తున్న దృశ్యం

పాల్వంచ: గుండెపోటు వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడుకోగలుగుతామని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు, 7వ దశ సీఈ శ్రీనివాసబాబు సూచించారు. గురువారం స్థానిక కర్మాగారంలో ఎస్‌పీఎఫ్ డీజీ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు కేటీపీఎస్ ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీఈలు మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తోందని పేర్కొన్నారు. అనుకోకుండా గుండెపోటుకు గురైన వారికి వెంటనే పక్కన ఉన్న వారు సీపీఆర్ చేయాలని చెప్పారు. అనంతరం వైద్యులు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. వైద్యులు రాకేశ్‌కుమార్, తేజశ్రీ, శివకుమార్, డి.కిరణ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు 'శాశ్వత' పరిష్కారం

- ఇక నుంచి యూడీఐడీ స్మార్ట్ కార్డులు జారీ
- అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక పోర్టల్
- కార్డుతో దివ్యాంగులకు మరింత ప్రయోజనం
- ఉమ్మడి జిల్లాలో 55,718 మంది దివ్యాంగులు



సదరం శిబిరాలకు హాజరైన దివ్యాంగులు (ఫైల్)

చుంచుపల్లి: దివ్యాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్లకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. వాటి స్థానంలో ఇక నుంచి యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చి దివ్యాంగులు నేరుగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఇవి పలు రాష్ట్రాల్లో అందుబాటులో ఉండగా, ఈ నెల నుంచి మన రాష్ట్రంలో కూడా పూర్తిస్థాయిలో అమల్లోకి తెస్తున్నారు. గతంలో ఈ స్మార్ట్ కార్డులను పలు చోట్ల దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఇటీవల సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులందరికీ ఈ యూడీఐడీ నంబర్‌ను జనరేట్ చేయాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్డుల కోసం ప్రభుత్వం ఇచ్చిన సంబంధిత వెబ్‌సైట్‌లో దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు కేవలం 7 కేటగిరీల్లో మాత్రమే సదరం సర్టిఫికెట్లు ఇస్తుండగా, ఈ యూడీఐడీ కార్డుల అమలుతో ఇక నుంచి 21 కేటగిరీలకు అవకాశం కల్పించారు. దివ్యాంగులకు బస్సు, రైళ్ల ప్రయాణాల్లో అందించే రాయితీలు అలాగే విద్య, వైద్యం, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తదితర వాటిని ఈ గుర్తింపు కార్డు ద్వారా పరిగణనలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఆసరా పింఛన్ ద్వారా దివ్యాంగులకు రూ.4,016ను ప్రతినెలా అందిస్తున్నారు. అలాగే వారు ఎవరిపై ఆధారపడకుండా ఆర్థికంగా ఎదగడానికి స్వయం ఉపాధి కోసం వివిధ రకాల రాయితీ రుణాలు సైతం అందిస్తున్నారు. మరోవైపు దివ్యాంగులకు సంక్షేమ శాఖ ద్వారా పలు రకాల ఉపకరణాలను అందిస్తున్నారు.

యూడీఐడీ కార్డు ఇలా పొందాలి..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 55,718 మంది శాశ్వత వైకల్యం కలిగినవారు ఉన్నారు. అంగవైకల్య శాతం ధ్రువీకరణ కోసం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో సదరం శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇస్తున్న సదరం ధ్రువపత్రాలు ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే పనిచేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో వీటిని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో వీటికి బదులు యూడీఐడీ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. http:// www. swavlambancard. gov. in పోర్టల్‌లోకి వెళ్లి యూడీఐడీ కార్డు కోసం సమగ్ర వివరాలు పొందుపర్చాలి.

- పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంతకం, ఆధార్ కార్డు తదితర వివరాలు అప్‌లోడ్ చేయాలి.
- మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి హాజరుకావాల్సి ఉంటుంది.
- సదరం శిబిరానికి హాజరయ్యేలా అందుబాటులోని కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి.
- తద్వారా ఏరోజు శిబిరం నిర్వహిస్తారో దరఖాస్తుదారుడి ఫోన్‌కు సందేశం వస్తుంది.
- ఆ రోజున వెళ్తే అక్కడి వైద్యులు పరీక్షించి వైకల్యం శాతాన్ని నిర్ధారించి పోర్టల్‌లో నమోదు చేస్తారు.
- ఇప్పటికే సదరం ధ్రువపత్రాలు కలిగిన వారికి కూడా స్మార్ట్ కార్డులను ఇదే తరహాలో జారీ చేస్తారు.
- వివరాలను సరిచూసి వైద్యులు నిర్ధారించిన అనంతరం స్మార్ట్ కార్డు మంజూరు చేస్తారు. డిజిటల్ సంతకాలతో కూడిన స్మార్ట్ కార్డులో ఐడీ నెంబర్, దివ్యాంగుడి పేరు, వైకల్య రకం, శాతం తదితర వివరాలు ఉంటాయి. వీటిని నేరుగా దివ్యాంగుల ఇంటి చిరునామాకు పంపుతారు.
- స్మార్ట్ కార్డులతో రైలు, బస్సు టికెట్లపై రాయితీలు పొందవచ్చు. పింఛన్లు, సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలు అందుకునే వెసులుబాటు ఉంది.
- దేశంలో ఎక్కడైనా ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది.
- కార్డును శాశ్వతంగా వినియోగించుకునే వీలుంటుంది.



యూడీఐడీ స్మార్ట్ కార్డ్

ఉమ్మడి జిల్లా వివరాలు ఇలా..

	భద్రాద్రి	ఖమ్మం
సదరం శిబిరాలకు హాజరైనది	31,906	62,390
టెంపరరీ వైకల్యం కలిగినవారు	3,882	7,853
శాశ్వత వైకల్యం కలిగినవారు	19,280	36,438
అనర్హులుగా తేల్చినది	8,744	18,099

దివ్యాంగులకు స్మార్ట్‌కార్డు వరం



దివ్యాంగులకు పూర్తిస్థాయిలో యూడీఐడీ కార్డులను ఇచ్చేందుకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తేవడం మంచి పరిణామం. యూడీఐడీ కార్డుల మంజూరు దివ్యాంగులకు వరం లాంటిది. సదరం సర్టిఫికెట్ల స్థానంలో వీటిని ఇవ్వటం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. దివ్యాంగుల సమగ్ర సమాచారం ఈ కార్డు ద్వారా తెలుసుకోవచ్చు.

–గండపనేని సతీశ్, టీవీపీఎస్ అధ్యక్షుడు కొత్తగూడెం

మరింత ప్రయోజనం



ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల స్థానంలో యూడీఐడీ కార్డులను అమల్లోకి తెచ్చింది. వీటిపైన దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ స్మార్ట్ కార్డును అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇది అన్ని ప్రాంతాల్లో చెల్లుబాటు అవుతుంది. దివ్యాంగులకు దీనివల్ల మరింత ప్రయోజనం కలుగుతుంది.

–ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

వేసవిలో బాక్సింగ్ ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న లగడపాటి రమేశ్

కొత్తగూడెంఅర్బన్: గ్రామీణ యువతీ యువకులు బాక్సింగ్‌పై అవగాహన లేక నేర్చుకోలేకపోతున్నారని, వారందరికి కూడా అవగాహన కల్పిస్తామని బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ లగడపాటి రమేశ్, చీఫ్ పాట్రన్ ఎర్రా కామేశ్ తెలిపారు. గురువారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బాక్సింగ్‌పై ఆసక్తి కలిగిన యువతీ యువకులకు రానున్న వేసవిలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని, క్రీడా సామగ్రిని ఉచితంగానే అందిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే అసోసియేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. వేసవిలో ఎన్‌ఐఎస్ శిక్షణ పొందిన ఈశ్వర్, జాతీయస్థాయి బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన శివసుబ్రహ్మణ్యం శిక్షకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన చైర్మన్‌గా లగడపాటి రమేశ్, అధ్యక్షులుగా ఉదయ్‌కాంత్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎం.రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా వై.శివసుబ్రహ్మణ్యం, ముఖ్య సలహాదారులుగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.సంజీవరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు, ఎల్బా జిల్లా అధ్యక్షులు దస్తగిరి, చీఫ్ పాట్రన్‌గా న్యాయవాది ఎర్రా కామేశ్, జవహర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా షమీఉద్దీన్‌తో పాటుగా ఆర్గనైజింగ్ సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీ, మిగతా సభ్యులను ఎన్నుకున్నారు.

వేసవిలోనూ నిరంతర విద్యుత్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎస్‌ఇ మహేందర్, అధికారులు

భద్రాచలంఅర్బన్: వేసవిలోనూ నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తుందని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) మహేందర్ అన్నారు. ఎండ వేడికి విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందనే ముందస్తు ఆలోచనతో భద్రాచలం పట్టణంలో రూ.1.50 కోట్లతో వివిధ కాలనీల్లో 28 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వాటిలో గురువారం 12 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్ఈ మహేందర్ ప్రారంభించి, మాట్లాడారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే జిల్లావ్యాప్తంగా వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా లోఓల్టేజీ సమస్యలు ఉంటే వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు తెలపాలని, వారు సమస్యను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తారని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం విద్యుత్ డీఈ జీవన్‌కుమార్, ఏడీఈ వేణు, ఏఈ రాజారావు, లైన్‌మెన్ త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్దెపైకి ఇలవేల్పులు..



పగిడిద్దరాజు - సమ్మక్కలను ఎదురిల్లుతున్న భక్తులు



సమ్మక్క - పగిడిద్దరాజును ప్రతిష్ఠిస్తున్న పూజారులు

- జనసంద్రమైన యాపలగడ్డ
- ఘనంగా పగిడిద్దరాజు – సమ్మక్క నాగబెల్లి

గుండాల: గద్దెలపైకి ఇలవేల్పులు చేరడంతో మండలంలోని యాపలగడ్డలో నిర్వహిస్తున్న జాతర పరిపూర్ణత సంతరించుకుంది. ఈ సందర్భంగా డోలి చప్పుళ్లు, గజ్జెల మోత, మహిళల పూనకాలు, యువత చిందులతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. గురువారం పగిడిద్దరాజు, సమ్మక్క (వనం) గద్దెపైకి రావడంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వన దేవతలను తీసుకొచ్చే దారిపొడవునా భక్తుల జయజయధ్వానాలతో హోరెత్తింది. వడ్డెలు, పూజారులు చిలకల గుట్ట నుంచి వనాన్ని తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. అరెం వంశీయులు పూజలతో వన దేవతలను స్వాగతించారు. పగిడిద్దరాజు – సమ్మక్కకు ఎదురిళ్ల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాలుగు గంటలకు జోగు నిర్వహించి, రాత్రి 8 గంటలకు దేవతలకు గంగాస్నానం చేయించి ఒడి నింపారు. సమ్మక్క – పగిడిద్దరాజులకు నాగవెల్లి నిర్వహించారు. డోలీలు, డప్పులతో గద్దెల వద్దకు భారీ సంఖ్యలో భక్తులు, మహిళలు పూనకాలతో తరలివచ్చారు. దేవతలను తాకేందుకు భక్తులు పోటీపడ్డారు. కాగా, జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గుండాల సీఐ రవీందర్, ఎస్‌ఐ రాజమౌళి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు అరెం అప్పయ్య, లక్ష్మీనర్సు, కాంతారావు, పెద్దకాంతారావు, నాగేశ్వరరావు, భిక్షం, లక్ష్మీనారాయణ, లచ్చుదొర, మానాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



సున్నం శివ (ఫైల్)

దమ్మపేట: వివాహేతర సంబంధం నెపంతో ఓ యువకుడిపై మరో వ్యక్తి ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన సున్నం శివ (28) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఆర్లపెంటలోని డబుల్ బెడ్రూం సముదాయం వద్దకు తన మిత్రుడిని కలవాలని వెళ్లాడు. అక్కడ శివను అదే గ్రామానికి చెందిన వగ్గెల శ్రీను అసభ్య పదజాలంతో దూషించాడు. తన భార్యను కలిసేందుకు వచ్చావని పేర్కొంటూ ఇనుపరాడ్డుతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శివను స్థానికులు లంకాలపల్లి వద్దకు తీసుకురాగా.. శివ బంధువు అనుదీప్ అక్కడి నుంచి పట్వారిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



వర్స సాగర్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామ పంచాయతీ నిజాంపేటకు చెందిన వర్స సాగర్ (30) గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలానికి చెందిన యువతితో సాగర్‌కు రెండు నెలల కిందట వివాహమైంది. కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంటివద్ద ఒంటరిగా ఉన్న సాగర్ ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. పొలం పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఇంట్లో వేలాడుతున్న సాగర్‌ను చూసి కిందకు దించారు. అప్పటికే సాగర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

బైక్ పైనుంచి పడి యువకులకు గాయాలు

పాల్వంచరూరల్: లారీని ఓవర్ టేక్ చేయబోయి ద్విచక్రవాహనం పైనుంచి యువకులు కిందపడి గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని జగన్నాథపురానికి చెందిన కార్తీక్, గోపీచంద్ కలిసి ద్విచక్రవాహనంపై రంగాపురం వైపు వెళ్తున్నారు. ఆర్‌టీఏ చెక్‌పోస్టు సమీపంలో నాగారంకాలనీ వద్ద బీసీయం జాతీయ రహదారిపై లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించామన్నారు.

అడవిలో చెలరేగిన మంటలు



అడవిలో చెలరేగుతున్న మంటలు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట సమీపంలో పెద్దగుట్టపై అడవిలో గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

బొలేరో, ఆటో ఢీ

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండాలో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆటో, బొలేరో ఢీకొన్న ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆటో, బొలేరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో బొలేరో రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. పడమటనర్సాపురానికి చెందిన ఆటోడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో ముందు భాగం దెబ్బతిన్నది. బొలేరో వాహనం డ్రైవర్, ఆటోడ్రైవర్ ఇద్దరూ స్నేహితులని తెలిసింది. పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

బాలిక కిడ్నాప్ కేసులో అరెస్ట్

పాల్వంచ: బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాఘవయ్య తెలిపారు. పట్టణంలోని ఓ బాలిక (17)ను పాత సూరారం గ్రామానికి చెందిన లకావత్ ప్రవీణ్ మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. కాగా బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఈనెల 3న కేసు నమోదు చేశామని, గురువారం అరెస్ట్ చేశామని చెప్పారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



సీసీ కెమెరాలో నమోదైన నిందితుడు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎన్‌కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. కాలనీ వాసి వెంకటేశ్వరరావు భార్యతో కలిసి విజయవాడ వెళ్లాడు. బుధవారం అర్ధరాత్రి తాళం పగలగొట్టిన దుండగుడు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంటి పక్కనే ఉండే వెంకటేశ్వరరావు కుమారుడు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. కాగా, దుండగుడు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది.

ఇసుక టిప్పర్ సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం పోలీసులు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని రాజమండ్రి నుంచి మండలంలోని పట్వారిగూడెంనకు ఇసుకను టిప్పర్‌లో తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

చిన్ననల్లబల్లిలో ట్రాక్టర్..

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గణేశ్ గురువారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య సిబ్బందితో కలిసి చిన్ననల్లబెల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేస్తున్నారు. అటువైపు నుంచి వచ్చిన ఓ ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా డ్రైవర్ పోలీసులను గమనించి పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అప్రమత్తమై ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఏనూటి రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.